సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం। 30। మార్చి। 2025



కొండను తవ్వి.. ఎలుకను పట్టారు!

ఉపాధి హామీ పథకం ద్వారా రూ.11 కోట్ల పనులు చేపట్టారు. ఇందులో కేవలం రూ. 1,03,633 అవినీతి జరిగినట్లు నిర్ధారించడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది॥ (సా॥)	సహర్ సోమ॥ (ఉ॥)
రాయచోటి	6.31	4.52
రాజంపేట	6.29	4.58
పీలేరు	6.31	4.51
మదనపల్లె	6.33	4.55

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 136 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

రాయచోటి జగదాంబసెంటర్ : తెలుగు నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి శనివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ శ్రీ విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్‌రావులు కూడా జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రకృతి అన్ని విధాలా కరుణించి.. జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురిసి... సిరుల పంటలు పండాలన్నారు., అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని వారు అభిలషించారు.

ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగంలో నియామకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలోని పలు నియోజకవర్గాలరకు ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగ అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పీలేరు అధ్యక్షుడిగా కేతం రెడ్డి లక్ష్మిరెడ్డి, బయక్కగారి వెంకటరామిరెడ్డిలను నియమించారు.

లక్ష్మీనరసింహునికి విశేషపూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామికి శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు జరిపారు. తోమాల సేవ, ఏకాంతసేవ నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని పలురకా పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొన్నారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

మామిడి తోటలపై ఏనుగుల దాడి



మామిడి తోటలను పరిశీలిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని కుక్కలదొడ్డి పంచాయతీ పరిధిలో ఉన్న మామిడి తోటలపై శనివారం తెల్లవారుజామున ఏనుగులు దాడి చేశాయి. బండి గుర్రమ్మ, పూర్ణమ్మలకు చెందిన మామిడి చెట్లు ధ్వంసం అయ్యాయి. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు మామిడి తోటలను పరిశీలించారు. ఏనుగుల జాడను తెలుసుకొని రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని పేర్కొన్నారు.

వడగాడ్పులపై అప్రమత్తంగా ఉండాలి

రాయచోటి : రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాడ్పులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్నం పూట బయటకు రావద్దని, పళ్లరసం, కొబ్బరినీరు ఎక్కువగా తాగాలని తెలిపారు. వడగాలులు నుంచి సంరక్షించుకునేందుకు టోపీ ధరించాలన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పన్ను చెల్లింపుదారులు జీఎస్టీ, వీఏటీ/సీఎస్టీ పన్నులు సకాలంలో చెల్లించాలని వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నులు చెల్లింపునకు ఆన్‌లైన్ ద్వారా 24 గంటలపాటు వెబ్‌సైట్ సౌకర్యం ఉందని, వెబ్‌సైట్‌లో ఈ–పేమెంట్ గేట్‌వే ద్వారా పన్నులు సులభంగా చెల్లించవచ్చన్నారు. అలాగే అసిస్టెంట్ కమిషనర్లు, జాయింట్ కమిషనర్ కార్యాలయాల్లో పన్ను చెల్లింపుదారులకు అవసరమైన సహాయ సహకారాలు, సందేహాల నివృత్తి కోసం సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు.

తమ్ముళ్లకు సై..కూలీలకు నై!

పండగ పూట ఉపాధి కూలీల పస్తులు

- జనవరి 13 నుంచి అందని కూలీ సొమ్ము
- ఇప్పటివరకు రూ.28 కోట్లు పెండింగ్
- తమ్ముళ్లు పనిచేసిన గోకులాలు, సీసీరోడ్ల బిల్లులు చెల్లింపుపైనే శ్రద్ధ



బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

బి.కొత్తకోట: ఉపాధిహామీ పథకం నిధులతో యంత్రాలతో టీడీపీ తమ్ముళ్లు చేసిన సిమెంట్‌రోడ్ల నిర్మాణం, గోకులాల షెడ్లకు నిధులు మంజూరు చేస్తున్న ప్రభుత్వం.. కష్టించి పనులు చేసిన వారికి కూలీ డబ్బులు ఇచ్చేందుకు నిర్లక్ష్యం చూపుతోంది. దీంతో ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకోవాల్సిన తెలుగు సంవత్సరాది ఉగాది పండగకు చేతిలో చిల్లిగవ్వలేక కూలీలు దిక్కులు చూస్తున్నారు. జనవరి 13 నుంచి వీరికి డబ్బు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ వారానికి ఆ వారం కూలీల బ్యాంకు ఖాతాలకు కూలీ సొమ్ము జమకావాల్సి ఉన్నా అలా జరగడం లేదు. కూలీకి వెళ్తేకాని గడవని కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం వీరు ప్రభుత్వం కూలీ డబ్బు ఎప్పుడు ఇస్తుందా అని ఎదురుచూస్తున్నారు.

పండగపూట.. పస్తులే

ఉగాది పండగను జరుపుకునేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి కూలీచేస్తే డబ్బులు అందక..పండగ ఖర్చులకు మరొకరి వద్ద చేతులు చాచే పరిస్థితి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసినవారంతా నిరుపేదలే కావడంతో పైసాపైసాకు అవస్థలు పడుతున్నారు. పండగకు ముందైనా సొమ్ము జమ అయితే వెసులుబాటుగా ఉంటుందని ఆశిస్తున్నారు. అయితే పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కాగా జిల్లాలో వందరోజులు, తర్వాత జిల్లాలోని 19 కరువు మండలాల్లోనూ 150 రోజుల పనిదినాలు పూర్తి చేశారు.

కాంట్రాక్టు బిల్లులపై శ్రద్ధ




కూటమి ప్రభుత్వం పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఉపాధి బిల్లులు చెల్లింపుకు చూపిన శ్రద్ధ కూలీలపై చూపడం లేదు. జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్‌రోడ్లు, గోకులాల నిర్మాణం కోసం లక్ష్యాన్ని నిర్దేశించి పనులు చేయించారు. యంత్రాలతో చేపట్టిన ఈ పనులకు ప్రభుత్వం బిల్లులను దాదాపు చెల్లించింది. టీడీపీ, దాని మిత్రపక్షాలకు చెందిన నాయకులు గ్రామాల్లో చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించేశారు. జిల్లాలో రూ.20 కోట్లకుపైబడి 1,112 గోకులాల నిర్మాణం, రూ.94 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం పనులు చేశారు. తమ కూటమి పార్టీల నేతలు చేసిన పనులు కావడంతో ప్రభుత్వం సిమెంట్‌రోడ్లకు సంబంధించి బిల్లులు చెల్లించేశారు. గోకులాల బిల్లులు కొంతమేర పెండింగ్‌లో ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. మొత్తానికి యంత్రాలతో చేసిన పనులకైతే బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యతగా ఇచ్చేశారు.

ఉపాధి పనుల వివరాలు

- జాబ్‌కార్డులు: 2.51 లక్షలు
- సభ్యులు: 4.22 లక్షలు
- యాక్టివ్ జాబ్‌కార్డులు: 2.07 లక్షలు
- సభ్యులు: 3.29 లక్షలు
- పనిదినాల లక్ష్యం: 93 లక్షలు
- పూర్తయినవి: 87.20 లక్షలు
- పూర్తయిన శాతం: 95
- వందరోజులు జాబ్‌కార్డులు: 20,938
- చేసిన ఖర్చు: రూ.227 కోట్లు

కూలీకి మొండిచెయ్యి



ఎండనక, వాననక చెరువులు, పొలాలు, గుర్తించిన చోట్ల పనులు చేసిన ఉపాధి హామీ పథకం కూలీలకు మాత్రం కూలీ డబ్బు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ఉపాధి పనులు చేస్తున్నారంటే విధిలేక, ఏ పని దొరక్క వస్తారు. అంటే అందరికంటే ముందు వీరికి జాప్యం లేకుండా కూలీ సొమ్మును చెల్లించాలి. అయితే జనవరి 13 నుంచి ఇప్పటిదాకా కూలీలకు సొమ్ము ఖాతాలకు జమ కాలేదు. ఇంతవరకు జిల్లాలో పనిచేసిన కూలీలకు రూ.28,00,40,750 బకాయిలు పెండింగ్‌లో ఉంది. ఈ బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారా అని వారు ఎదురు చూస్తున్నారు.

ఉగాదికి పైసా లేదు



రెండు మాసాలుగా ఉపాధి బిల్లులు అందలేదు. కూలీ పనులపైనే ఆధారపడి జీవిస్తున్నాం. ఉపాధి పనులతో కడుపు నింపుకుంటున్న మాకు ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోలేకపోతున్నాం. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు. అధికవడ్డీలకు అప్పులు తెచ్చుకోలేం. ప్రభుత్వం వెంటనే స్పందించి కూలీ డబ్బు ఇవ్వాలి. –సి.రత్నమ్మ, ఉపాధి కూలీ, ఎద్దులవారికోట, తంబళ్లపల్లె

రూ.10 వేలు రావాలి



ఉపాధి కూలీ పనులు చేసినందుకు రూ.10వేలు రావాలి. పండగ సంతోషంగా జరుపుకునేందుకు చేతిలో డబ్బు లేదు. మేం కూలీ చేసేది కుటుంబం గడవడం కోసం. ప్రభుత్వం సొమ్మును చెల్లించక ఇబ్బంది పడుతున్నాం. ఇప్పుడు బిల్లులు ఇస్తే పండగను సంతోషంగా జరుపుకుంటాం. –కవిత, ఉపాధి కూలీ, బ్రాహ్మణఒడ్డిపల్లె, కురబలకోట

2 వారాలకు ఇచ్చారు



పెండింగ్‌లోని ఉపాధి కూలీ సొమ్ములో రెండు వారాలకు సంబంధించిన డబ్బును ప్రభుత్వం విడుదల చేసింది. ఇంకా ఎనిమిది వారాలకు సంబంధించి విడతల వారీగా ఇస్తుంది. బిల్లుల పెండింగ్‌కు కారణాలు తెలియవు. కూలీ సొమ్ముకు సంబంధించిన వివరాలు, పనులకు చెల్లించాల్సిన కూలీ సొమ్ము వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తున్నాం. –వెంకటరత్నం, డ్వామా పీడీ, రాయచోటి

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శాశ్వత కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని టీటీడీ సివిల్ విభాగం అధికారి మనోహర్ పేర్కొన్నా. శనివారం ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్లను ఈఈ సుమతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శాశ్వత కల్యాణ వేదిక వద్ద నిర్మిస్తున్న హై లెవల్ వాటర్ ట్యాంక్, టీటీడీ భక్తుల విడిది గృహంపై నిర్మిస్తున్న అదనపు ఫ్లోర్ పనులను, అన్న ప్రసాద కౌంటర్ల పనులను పరిశీలించి, నిర్మాణదారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.పనులు నాణ్యతతో చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నాగరాజు, ఏఈ అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అందుబాటులో ప్రభుత్వ సేవలు



రాయచోటి : ఆర్థిక సంవత్సరం చివరిరోజు ఆదివారం అయినప్పటికీ ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంటాయని వివిధ శాఖల అధికారులు తెలియపరిచారు. ముఖ్యంగా విద్యుత్, మున్సిపాల్టీ, బ్యాంకులతోపాటు సబ్ రిజిస్టర్ కార్యాలయాలు కూడా పనిచేస్తాయని ఆయా శాఖల అధికారులు పేర్కొన్నారు. మున్సిపాల్టీలో పన్నుల చెల్లింపులు విద్యుత్ శాఖలో కరెంటు బకాయిలు చెల్లింపులకు కౌంటర్లు కొనసాగుతాయన్నారు. బ్యాంకు లావాదేవీలు యథావిధిగా కొనసాగుతాయని అసిస్టెంట్ రిజిస్టర్ అధికారులు సునీల్ తెలిపారు. అయితే రిజిస్టర్ ఫీజుల కంటే అదనపు ఫీజులు వసూలు చేస్తారని తెలియజేశారు.

నేడు బలిజపల్లె గంగమ్మ జాతరకు అంకురార్పణ



బలిజపల్లెలో వెలసిన గంగమ్మ స్వయంభు



జాతర జరిగే ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర నిర్వహణకు ఆదివారం రాత్రి అంకురార్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా గంగమ్మ స్వయంభు వద్ద గంటకు పైగా పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. వేలాది మంది భక్తులు అంకురార్పణ వేడుకలో పాల్గొననున్నారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలావుంటే ఏప్రిల్ 3వ తేదీ గంగమ్మ జాతర జరగనుంది.

నేడు అగ్రహారంలో అంకాళమ్మకు పొంగళ్లు

మండలంలోని తుమ్మల అగ్రహారం బలిజపల్లె గంగమ్మకు పుట్టినిల్లు. అందువల్ల బలిజపల్లె గంగమ్మ జాతరకు ఆదివారం అంకురార్పణ చేసే సమయంలో తుమ్మల అగ్రహారంలో వెలిసన అంకాలమ్మకు ఆ గ్రామ ప్రజలు పెద్దఎత్తున పొంగళ్లు పెట్టనున్నారు. దీంతో అంకాలమ్మ సన్నిది వద్ద నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బలిజపల్లె గ్రామాన్ని సందర్శించిన ఏఎస్పీ

ఏప్రిల్ 3వ తేదీ జరగనున్న బలిజపల్లె గంగమ్మ జాతరకు ఆదివారం రాత్రి అంకురార్పణ చేపట్టనున్నందున ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే శనివారం బలిజపల్లె గ్రామాన్ని సందర్శించారు. జాతర రోజు గంగమ్మ ప్రతిమను తయారు చేసే ప్రాంతాన్ని, అక్కడ నుంచి గుడిలోకి తీసుకొచ్చే మార్గాన్ని పరిశీలించారు. అంకురార్పణకు ఎంత మంది భక్తులు వస్తారు, వారికి అసౌకర్యం కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ అర్బన్ సీఐ రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి జాతరను అందరూ కలిసి మెలసి సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా ఘర్షణలకు దిగి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.జాతర అంకురార్పణ కార్యక్రమంతో పాటు బుధవారం అర్ధరాత్రి ప్రారంభమై శుక్రవారం తెల్లవారుజామున వరకు జరిగే జాతర ప్రశాంత వాతావరణంలో ముగియడానికి నిర్వాహకులు, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ రాజ, ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్త ఉషస్సుల విశ్వావసు



పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



కిటకిటలాడుతున్న మదనపల్లెలోని బెంగుళూరు బస్టాండు సర్కిల్

- షడ్రుచుల సమ్మేళనం
- నేడు ఉగాది



మదనపల్లె సిటీ : తెలుగు ప్రజల తొలి పండుగ ఉగాది. వసంత రుతువు ఆగమనంతో చైత్రశుద్ధ పాడ్యమి నుంచి కొత్త సంవత్సరం ఉగాది పర్వదినంతోనే ప్రారంభమవుతుంది. నూతన ఉత్సవాలను నాందిగా పండుగ జరుపుకోనుండగా. ఈ ఏడాది శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఆదివారం నుంచి ప్రారంభమవుతోంది. నూతన సంవత్సరంగా భావించే ఈ రోజున కొత్త కార్యాలు ప్రారంభిస్తే శుభప్రదంగా ఉంటుందని నమ్మకం. ఇప్పటికే ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేయగా, అర్చకులు పంచాంగ పఠనం చేయనున్నారు.ఉగాది నాడు పంచాంగ శ్రవణంతో పాటు పచ్చడికి విశేష ప్రాధాన్యత ఉంది. ఇది షడ్రుచుల సమ్మేళనం. జీవితంలో ఎదురయ్యే మంచీచెడులు, కష్టసుఖాలను ఒకేలా స్వీకరించాలని ఉగాది పచ్చడి చెబుతోంది. ఉగాది పండుగ పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమ ఏర్పాట్లు చేశారు. ముందుగా దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చకులు, పండితులు పంచాంగశ్రవణం చేయనున్నారు.

భవిష్యత్తు వివరించేదే పంచాగం



గ్రహాల ఆధారంగా ముహూర్తాలు పంచాగంలో వివరించారు. పంచాంగం భవిష్యవాణిని తెలుపుతుంది. దినాధిపతులు, తారాబలం కూడా తెలుసుకోవచ్చు. వర్షాలు, పంటలు, కాలం తదితర అంశాలు, వ్యాపారాలు, ఉద్యోగాల తదితర అంశాలను పంచాంగం ద్వారా వెల్లడవుతాయి.

– శివకుమార్‌శర్మ, పంచాంగకర్త,వేదపండితులు, మదనపల్లె.

సకల శుభదాయకం



శ్రీ విశ్వావసునామ సంవత్సరం మంచి మార్పునకు నాందిగా నిలుస్తుంది. ఈ రోజు తలంటుస్నానం ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఇష్టదైవాన్ని పూజించాలి. ఉగాది పచ్చడి స్వీకరిస్తే మంచి జరుగుతుంది. అలాగే, పంచాగం వినడం ద్వారా అరిష్టాలు తొలగి శుభదాయకంగా ఉంటుంది.

– సాయిచక్రవర్తి, వేదపండితులు, మదనపల్లె.

రేషన్‌కార్డుదారులకు ఊరట

ఈకేవైసీకి ఏప్రిల్ 30 వరకు గడువు



రాయచోటి : ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుదారులందరికీ ఊరట లభించింది. ఈకేవైసీ గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రఘురామ్ తెలిపారు. మామూలుగా ఈనెల 31 నాటికి గడువు ముగియనుంది. నెలరోజులు పొడిగించారు. అయితే ఈ పర్యాయం గ్రామ, వార్డు సచివాలయాలకు సంబంధించిన యాప్, రేషన్ షాపులోని ఈ–పాస్ ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. రేషన్ కార్డులో పేరు ఉన్న అయిదు సంవత్సరాలు.. అంతకంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు మినహా మిగిలిన వాలందరూ కూడా ఈకేవైసీని పూర్తి చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం సూచించింది.

కార్డులు తగ్గించేందుకే...

అనర్హత కార్డుల గుర్తింపు కోసం అంటూ కార్డులలో కోత కోయడానికి పౌర సరఫరాల మంత్రిత్వశాఖ ఈకేవైసీ ప్రక్రియను చేపట్టిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకే ఇంట్లో ఉంటూ రెండు నంబర్ల ద్వారా కార్డులను పొందడం, మృతి చెందిన కుటుంబ సభ్యుల పేర్లను అందులో నుంచి తొలగించకపోవడం, వాళ్ల పేర్ల మీద రేషన్ సహా ఇతర సంక్షేమ పథకాలు లబ్ధిని పొందుతోండటం వంటి వాటిని గుర్తించి ఈకేవైసీ ప్రక్రియను చేపట్టిందన్న వాదనలు ఉన్నాయి. అనేకమంది పొట్టకూటికోసం, కుటుంబ పోషణ కోసం పక్కరాష్ట్రాలు, పరాయి దేశాల్లో జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారు త్వరితగతిన స్వగ్రామాలకు చేరుకొని ఈకేవైసీ చేయించుకునే పరిస్థితుల్లో లేరని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి సమయాల్లో ఈకేవైసీ నెపం చూపి వారిని కార్డుల నుంచి తొలగించడం, ఆ కుటుంబ కార్డులను రద్దు చేయడం జరుగుతుందన్న భయం స్థానికుల్లో నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను ఆసరాగా చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈకేవైసీ ప్రక్రియను అనుకున్న విధంగా పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తోంది. దీని వల్ల వేల కార్డుదారులకు బియ్యం సహా ఇతర నిత్యావసర సరుకులు దక్కకపోవచ్చని రెవెన్యూ అధికారుల నోట వినిపిస్తున్న మాట. దీనిపై కొంతకాలంగా అధికారులు కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ఈకేవైసీ నమోదులో కార్డుదారులను సాంకేతిక సమస్యలు ఇబ్బందులు పెడుతున్నాయి. గడువు దగ్గర పడినప్పటికీ ఇప్పటికీ ఈ ప్రక్రియ పూర్తి కావట్లేదనే ఫిర్యాదులు అధికారులకు అందుతున్నాయి.దీంతో ఏప్రిల్ 30వ తేదీ వరకు ఈకేవైసీ గడువును పొడిగించినట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. గుడ్లపల్లెకు చెందిన రెడ్డికిరణ్(30) కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యతో గొడవపడి మనస్తాపం చెంది పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నీలిపల్లిలో చోరీయత్నం విఫలం

నందలూరు : మండల కేంద్రంలోని నీలిపల్లి గ్రామంలో శనివారం వేకువజామున సనావర్ అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చోరీకి ప్రయత్నించారు. బడేరాత్ సందర్భంగా పాటూరుకు వెళ్లిన ఆ ఇంట్లోని యువకులు షేక్ సల్మాన్, షేక్ షబీర్ బాషాలు తిరిగి వచ్చేటప్పటికి.. గేటు తెరిచి ఉండగా గమనించారు. అలికిడి విన్న దొంగలు పారిపోయే ప్రయత్నంలో.. షేక్ సల్మాన్‌పై ఇనుప రాడ్డుతో దాడి చేశారు. యువకులు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించినా వారు పొలాల వెంట పారిపోయారు. దొంగలు వేసుకొచ్చిన బైక్‌తోపాటు దాడి చేసిన రాడ్డు, చెప్పులను అక్కడే వదిలి వెళ్లారు. ఈ సంఘటనపై యువకులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని బైకు, ఇనుప రాడ్డు, చెప్పులను స్వాధీన పరుచుకున్నారు. సాయంత్రం ఏఎస్‌ఐ మోసెస్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

కారు దగ్ధం కేసులో వ్యక్తి అరెస్ట్

రామసముద్రం : మండలంలో 15 రోజుల క్రితం టీడీపీ మండల అధ్యక్షుడి కారును కాల్చివేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. ఈ నెల 10వ తేదీన రాత్రి గుంతలపేటలో టీడీపీ మండలాధ్యక్షులు ఇంటి వద్ద ఉన్న నిలిపి ఉన్న కారును గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేశారు. దీనిపై కేసు నమో దు చేసిన సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రవికుమార్‌లు పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానంతో.. కారు కాల్చిన వ్యక్తుల కోసం విచారణ చేపట్టారు. ఈ విచారణలో గుంతలపేటకు చెందిన ఎస్.శ్రీనివాసు లు కారుకు నిప్పు అంటించినట్లు నిర్ధారణ అయిన ట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు అతనిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.



• చంద్రకాంతిలో కలువ సోయగం

సాధారణంగా సూర్యకాంతిలో వికసించే అనేక పువ్వులు మనకు తెలుసు, రాత్రిపూట వికసించే కొన్ని పువ్వులు కూడా ఉన్నాయి. వింతలు, విశేషాలకు ప్రకృతి నెలవు. సిద్దవటంలోని అటవీశాఖ కార్యాలయంలో రాత్రిపూట చంద్రకాంతిలో కలువపువ్వు వికసించి అందరినీ అబ్బురపరిచింది. సాధారణంగా కలువ పూలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం లోపు వికసిస్తాయి. కానీ ముదురు ఎరుపు లేదా గులాబీ లేదా ఊదా రంగులో ఉండే ఈ నీటి కలువ.. శనివారం సాయంత్రం సంధ్యా సమయంలో వికసించింది. నీటిలో తేలియాడే ఈ అందమైన ప్రకాశవంతమైన పువ్వు చీకటి నేపథ్యంలో చాలా మర్మంగా కనిపిస్తుంది. 6 నెలల కిందట 8 రకాల కలువ పువ్వులను వివిధ ప్రదేశాల నుంచి తెప్పించి కార్యాలయం ఆవరణంలో మూడు తొట్లలో నాటామని సిద్దవటం రేంజర్ కళావతి తెలిపారు. రాత్రి పూట వికసిస్తూ కనువిందు చేస్తోందని ఆమె చెప్పారు.

– సిద్దవటం


సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో చంద్రకాంతిలో వికసించిన కలువ పువ్వు

• అగ్నికి అరటి చెట్లు ఆహుతి

ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు గ్రామంలోని తోటలో మంటలు చెలరేగి అరటి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన పోతినేని చెంగయ్య నాయుడు తనకు ఉన్న పొలంలో అరటి పంట సాగు చేశాడు. చెట్లు కాయలు కాస్తున్నాయి. ఈ క్రమంలో ఆకతాయిలు నిప్పంటించారో, ఎవరో తాగి పడేసిన బీడి ముక్క నుంచి మంటలు వ్యాపించాయో తెలియదు కానీ.. అరటి తోటలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఎండ వేడిమికి మంటలు చెలరేగి, తోట మొత్తం వ్యాపించాయి. దీంతో 51 అరటి చెట్లు, విద్యుత్ మోటారు స్టార్టర్, సోలార్ సిస్టమ్, ఎరువులు దగ్ధమయ్యాయి. చెంగయ్య నాయుడు చుట్టు పక్కల రైతుల సాయంతో.. మంటలను అదుపు చేసినప్పటికీ కాపాడుకోలేకపోయాడు. అగ్ని ప్రమాద సమయంలో కరెంటు కూడా లేదని, అయితే ప్రమాదం ఎలా జరిగిందో అర్థం కావడం లేదని బాధిత రైతు వాపోయాడు. దాదాపు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు.

– ఓబులవారిపల్లె


అరటి తోటకు నిప్పు అంటుకోవడంతో కాలిపోయిన చెట్లు, స్టార్టర్, సోలార్ సిస్టమ్

కొండను తవ్వి.. ఎలుకను పట్టారు!

- రూ.11 కోట్ల పనులకు రూ.1 లక్ష అవినీతి జరిగినట్లు నిర్ధారణ
- నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లపై వేటు
- సామాజిక తనిఖీలో లోపించిన పారదర్శకత


మాట్లాడుతున్న ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం

గాలివీడు : 'కొండను తవ్వి.. ఎలుకను పట్టిన' చందంగా ఉంది.. ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం అధికారుల పరిస్థితి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24 సంవత్సరానికి గాను 17 గ్రామ పంచాయతీల్లో రూ.11 కోట్ల పనులు చేపట్టారు. ఇందులో కేవలం రూ.1,03,633 అవినీతి జరిగినట్లుగా అధికారులు నిర్ధారించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక తనిఖీ బృందం శ్రమించి తయారు చేసిన నివేదికల్లో డొల్లతనం కొట్టొచ్చినట్లు కనిపించిందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ జవహర్ బాబు అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ నివేదిక బహిరంగ సమావేశానికి అన్నమయ్య జిల్లా ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం, ఏపీడీ లోకేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎస్ఆర్పీ సుబ్బారావు, ఎస్టీఎమ్ లోకేస్వర్‌రెడ్డి తమ నివేదికలను చదివి వినిపించారు. అందులో భాగంగా పేరంపల్లి రూ.3008, గోపనపల్లె రూ.544, తూముకుంట రూ.4261, ఎగువగొట్టివీడు రూ.1710, గుండ్లచెరువు రూ.14003, కొర్లకుంట రూ.6094, నూలివీడు రూ.10,004, పూలుకుంట రూ.298, వెలిగల్లు రూ.11592, గాలివీడు రూ.12,236, గరుగుపల్లి రూ.3604, పందికుంట రూ.10,518, తలముడిపి రూ.4409, అరవీడు రూ.8614, బోరెడ్డిగారిపల్లి రూ.2,948, సీసీ పల్లి రూ.5,825, గోరాన్ చెరువు రూ.10,165 గ్రామాల్లో అవినీతి జరిగినట్లుగా నిర్ధారించి రికవరీకి ఆదేశించారు. బాధ్యులుగా నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లు బాలాజీ, మల్లికార్జున, పురుషోత్తంరెడ్డి, ఖాదర్ బాషాను గుర్తించి, సస్పెండ్ చేశారు. ఈ గణాంకాలను పరిశీలించిన అనంతరం బహిరంగ సభలో ఉన్న ప్రజలు, అధికారులు విస్తుపోవడం వారి వంతయ్యింది. మొత్తంగా ఈ నివేదిక ద్వారా అతి తక్కువ అవినీతి జరిగినట్లుగా, పారదర్శకంగా పనులు జరిగాయని సామాజిక తనిఖీ బృందం తేల్చడం పలు విమర్శలకు తావిస్తోంది. మార్చి 14 నుంచి 27వ తేదీ వరకు జరిగిన ఆడిట్‌లో సామాజిక తనిఖీ బృందం తూతూ మంత్రంగా తనిఖీ నిర్వహించి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి పెద్ద ఎత్తున ముడుపులు అందాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నివేదికలు మరింత బలం చేకూరుతున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. పెద్దఎత్తున అవినీతి జరిగినట్లుగా నిర్ధారణకు వచ్చిన ఉన్నతాధికారులు నలుగురు టెక్నికల్ అసిస్టెంట్లపై వేటు వేసి ఊరుకున్నారే తప్ప.. అవినీతి లెక్కలు తేల్చడంలో తనిఖీ బృందం విఫలమైందన్న విషయం బహిర్గతమయ్యిందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన ఎర్రగంరెడ్డి

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం నీలకంఠ్రావుపేట గ్రామం శివాలయం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండలం నూలివీడుకు చెందిన ఆవుల ఎర్రగంరెడ్డి, బాలిక కడపలో చదువుకుంటూ సెలవుల కారణంగా ఇరువురు ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరారు. మార్గంమధ్యలో శివాలయం వద్దకు రాగానే ముందు వైపున కడప నుంచి రాయచోటి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికుల కోసం నిలుపుటకు ప్రయత్నించింది. బస్సు వెనుక వైపున వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆవుల ఎర్రగంరెడ్డి, బాలిక కింద పడి గాయాల పాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం


హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ కుటుంబానికి నగదు అందజేస్తున్న పోలీసు అధికారులు

రాయచోటి టౌన్ : వాయల్పాడు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పీలేరులో కాపురం ఉంటూ ఇంటికి వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ కుటుంబసభ్యులను పరామర్శించి దహన సంస్కారాల కోసం లక్ష రూపాయల నగదును పోలీసు అధికారులు ఆదినారాయణ భార్య శివకుమారికి అందజేశారు. ఆదినారాయణ మృతి పట్ల వాయల్పాడు ఎస్‌ఐ చంద్రశేఖర్, సహోద్యోగులు విచారం వ్యక్తం చేసి చిత్తూరు జిల్లాలోని పులిచెర్ల మండలం మంగళంపేట బలిజపల్లిలో వారి స్వగృహంలో ఆదినారాయణ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గువ్వలచెరువులో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం : మతసామరస్యానికి ప్రతీక రంజాన్ అని, ఈ మాసంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రామాపురం మండలం గువ్వలచెరువులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో గువ్వలచెరువు ముస్లిం పెద్దలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ, తూర్పుపల్లికి చెందిన సుంకేసుల శ్రీనివాసులు (44) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పులబాధ భరించలేక శనివారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, మిత్రులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. దీనిపై పోలీసులకు సమాచారం లేదని, విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నవీన్ బాబు తెలిపారు.

తంబళ్లపల్లెలో తమ్ముళ్ల వర్గ పోరు

- టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో ఉద్రిక్తత
- జేసీఆర్, శంకర్ వర్గాల మధ్య వాగ్వాదం


ములకలచెరువులో శంకర్ వర్గం వేడుకలు

బి.కొత్తకోట : తంబళ్లపల్లె నియోజకవర్గంలో శనివారం జరిగిన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో.. రెండు వర్గాల మధ్య వాగ్వాదం, జెండాలు ఎగురవేసే విషయంలో వివాదాలు, ఉద్రిక్తతలకు దారితీసి.. పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. బి.కొత్తకోటలో కేవలం పది మీటర్ల దూరంలో రెండు వర్గాలు ఒకేసారి జెండాలు ఎగురవేయడం.. స్థానికులను టెన్షన్‌కు గురిచేసింది. ఈ వివరాల్లోకి వెళ్తే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఓడిపోయిన అభ్యర్థి జయచంద్రారెడ్డి నాయకత్వంలో పని చేయలేమంటూ మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గం బలంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు టీడీపీ ఆవిర్భావ వేడుకలు వేదికగా.. వర్గ పోరు ఏస్థాయిలో ఉందో బహిర్గతం చేసింది.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట జ్యోతిచౌక్‌లో శంకర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రారంభించిన జెండా వద్ద ఆయన వర్గీయులు వేడుకలకు సిద్ధమయ్యారు. దీనికి పదిమీటర్ల దూరంలో జయచంద్రారెడ్డి వర్గీయులు కొత్తగా జెండా దిమ్మెకట్టి అక్కడే వేడుకలు జరిపారు. రెండు వర్గాలు ఒకే సమయంలో కార్యక్రమాలకు సిద్ధం కావడంతో స్థానికులు టెన్షన్‌కు గురయ్యారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం కూడలిలోని పాత జెండా దిమ్మెకు ఉన్న పైపును జయచంద్రారెడ్డి వర్గీయులు కోసేసి పక్కన పెట్టారని శంకర్ వర్గీయులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. దీనితో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తత దారితీసింది. పోలీసులు జోక్యం చేసుకున్నారు. తర్వాత పాత జెండాను వదిలేసి ఎవరికి వారు వేర్వేరు చోట్ల వేడుకలు జరుపుకొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లెలో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయి వాగ్వాదం ఉద్రిక్తతకు దారితీసింది. శంకర్ హయాంలో నిర్మించిన జెండా దిమ్మెపై జయచంద్రారెడ్డి వర్గీయులు జెండాను ఎగురవేయడాన్ని శంకర్ వర్గం తీవ్రంగా ఆక్షేపించింది. శంకర్ వర్గం జెండా ఎగురవేసేందుకు రాగా.. అక్కడ జయచంద్రారెడ్డి వర్గీయులు అడ్డుగా బ్యానర్ పెట్టడంతో తీవ్రస్థాయిలో రెండు వర్గాల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. ఎస్‌ఐ, పోలీసులు చేరుకుని సర్దిచెప్పారు. తర్వాత శంకర్ వర్గం అన్నదానం చేసి వెళ్లిపోయింది.

ములకలచెరువులో..

జయచంద్రారెడ్డి సొంత మండలం ములకలచెరువులో శంకర్ వర్గీయుడు, మండల కన్వీనర్ సిద్దా మిగతా మండలాలకు భిన్నంగా కార్యక్రమం నిర్వహించి బలప్రదర్శన చేశారు. దీనితో జయచంద్రారెడ్డి వర్గం పోటీ కార్యక్రమాలు నిర్వహించారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రంలో ఉద్రిక్తత పరిస్థితులను ముందే పసిగట్టిన ఎస్‌ఐ రెండువర్గాలతో శుక్రవారమే చర్చించి ఇబ్బందికర వాతావరణం సృష్టించొద్దని స్పష్టం చేశారు. దీనితో రెండు వర్గాలు ఎవరికి వారు వేడుకలు జరుపుకొని వెళ్లిపోయారు.

■ కురబలకోట మండలంలోనూ రెండు వర్గాలు పోటాపోటీగా వేడుకలను జరుపుకొన్నారు.

గడ్డి వాముల దగ్ధం

తంబళ్లపల్లి : అగ్ని ప్రమాదంలో మూడు గడ్డి వాములు దగ్ధమైన ఘటన శనివారం రాత్రి మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. పరసతోపు పంచాయతీ చేలూరు వాండ్లపల్లెకు చెందిన టి.మద్దిరెడ్డికి చెందిన మూడు గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. రూ.75 వేలు ఆస్తి నష్టం జరిగింది. గ్రామ సమీపంలో వరి కసువు కొనుగోలు చేసి వామి వేశారు. పక్కనే వేరుశనగ కట్టె, ఉలవ పొట్టు వాములు ఉన్నాయి. గుర్తు తెలియని దుండగులు నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు గుర్తించి ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.

రూ.50 వేల నష్టం

రాయచోటి : రాయచోటి మండలంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల కోసం నిల్వ ఉంచుకున్న గడ్డివామి కాలి బూడిదయింది. దీంతో రూ.50 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైతు బసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మాధవరం పంచాయతీ కంచరపల్లిలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న సంఘటనలో రైతు బసిరెడ్డికి చెందిన గడ్డివామి కాలిపోయింది. పశువుల కోసం రూ.50 వేలు వ్యయం చేసి కొనుగోలు చేసిన గడ్డిని భద్రంగా నిల్వ ఉంచుకున్నారు. ప్రమాదవశాత్తు సంబంధించిన అగ్నిప్రమాదానికి ఆ గడ్డి మొత్తం కాలిపోయింది.

రాయచోటి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి

రాయచోటి టౌన్ : రాయచోటి బార్ అసోసియేషన్‌కు శనివారం ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎస్.ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. పోలైన 87 ఓట్లలో 48 ఓట్లు ప్రభాకర్‌రెడ్డికి రాగా ప్రత్యర్థి రమేష్‌రెడ్డికి 39 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి ప్యానెల్‌కు చెందిన ధనుంజయ్‌కుమార్ ప్రత్యర్థి రామచంద్రారెడ్డిపై ఒక్క ఓటుతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా పి.రెడ్డిబాషా 11 ఓట్ల మెజార్టీతో, ట్రెజరర్‌గా ఆదిరెడ్డి నాయక్ నాలుగు ఓట్ల మెజార్టీతో, లైబ్రరీ సెక్రటరీగా టీవీ రమణ రెండు ఓట్ల మెజార్టీతో గెలిచారు. స్పోర్ట్స్ కార్యదర్శిగా సిద్దయ్య గెలుపొందారు. ఎన్నికల అధికారిగా కె.రాజ్‌కుమార్‌రాజు వ్యవహరించారు.

నాటుసారా, కర్ణాటక మద్యం స్వాధీనం


నాటుసారా విక్రయిస్తున్న నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె : మండలంలోని పలు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు శనివారం నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల నాటుసారాతోపాటుగా 31 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భీమలింగ తెలిపారు. శనివారం వివిధ కేసుల్లో పట్టుబడిన నిందితులను అరెస్ట్ చూపారు. ఈ సందర్భంగా సీఐ భీమలింగ మాట్లాడుతూ సీటీఎం దళితవాడలోని ఓ ఇంట్లో నాటుసారా విక్రయిస్తున్న యర్రబల్లి బుజ్జి(42), అదే గ్రామానికి చెందిన పెద్దింటి లక్ష్మీనారాయణను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇదే కేసులో నిందితులకు నాటుసారా సరఫరా చేసిన వాల్మీకిపురం మండలం దిగువ మేకలవారిపల్లెకు చెందిన ఎం.మల్లికార్జున(27)ను మూడో నిందితుడిగా కేసులో చేర్చామన్నారు. సారా స్వాధీనం చేసుకున్న కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు పంపామన్నారు. అనంతరం చీకలబైలు గ్రామంలో నిర్వహించిన దాడుల్లో జె.నాగమ్మ వద్ద కర్ణాటక 31 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు డార్కస్, జబీవుల్లా, కానిస్టేబుళ్లు నాగరాజు, మణి, మధు, శివరాణి, గంగా, మహేశ్వరి, రేఖలు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు.. దంపతులు మృతి


సరోజ మృతదేహం


మృతి చెందిన రామ్మోహన్

కొండాపురం : మండల కేంద్రంలోని తాడిపత్రి–కడప జాతీయ రహదారిలో శనివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో దంపతులు మృతి చెందారు. ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపురం మండలంలోని ముచ్చుమర్రి గ్రామానికి చెందిన తూర్పింటి రామ్మోహన్(45), సరోజ(40) దంపతులు పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. కొండాపురం నుంచి వారు తెల్లవారుజామున తాడిపత్రి వైపు ముచ్చుమర్రి గ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. కొండాపురంలోని జాతీయ రహదారిలో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే 108 వాహనంలో తాడిపత్రిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సరోజను వైద్యుడు పరిశీలించి మృతి చెందినట్లు తలిపారు. రామ్మోహన్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్యాభర్తలు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు దుఃఖ సాగరంలో మునిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెహందీ అందాలు

- ఊపందుకున్న గోరింటాకు అమ్మకాలు
- అంతటా రంజాన్ సందడి


చిన్నారికి గోరింటాకు అందాలు


చేతికి గోరింటాకు

మదనపల్లె సిటీ : పవిత్ర రంజాన్ మాసం చివరి దశకు చేరింది. ఈద్–ఉల్–ఫితర్ పవిత్ర పర్వదినం రానుంది.ఈద్‌కు గుర్తుకు వచ్చేది మెహందీనే. ముస్లింల ప్రతి ఇంటిలో చిన్నారులు మెహందీతో చేతులకు అందంగా అలంకరించుకుంటారు. రంజాన్ పండుగతో మెహందీకి ఓ అనుబంధం ఉంది. ఒకప్పుడు మెహందీ కోసం గోరింటాకుతో పాటు కొన్ని పదార్థాలను కలిపి బాగా నున్నగా రుబ్బి పేస్టుగా చేసి చేతులకు పెట్టుకునేవారు. కాలం మారింది. ఇప్పుడు మార్కెట్‌లో వివిధ రకాల మెహందీ కోన్‌లు, పౌడర్‌లు అందుబాటులోకి వచ్చాయి. వీటిని కొనుగోలు చేసి పిల్లల చేతులకు వివిధ రకాల డిజైన్లతో అలంకరిస్తున్నారు. ముస్లింలు నివసించే ప్రాంతాల్లో ఏ ఇంటికి వెళ్లినా చిన్నారుల చేతులు మెహందీ అందాలతో దర్శనమిస్తున్నాయి.

'మెహందీ,గాజుల అమ్మకాల జోరు

జిల్లాలోని మదనపల్లె పట్టణంలో ముస్లింలు అధికంగా ఉన్నారు. మెహందీలతో పాటు వివిధ రంగుల గాజులు, సెంట్లు అమ్మకాలు ఊపందుకున్నాయి. రంగు రంగు డిజైన్లతో అందుబాటులోఉన్న మెహందీని చేతులు, కాళ్లకు అలంకరించుకుంటున్నారు. దుకాణాల వద్ద వివిధ రకాలుగా డిజైన్లు వేసే కళాకారులు సైతం బిజీబిజీగా ఉంటున్నారు.


పండుగ కోసం వివిధ రకాల గాజులు


అమ్మకానికి సుగంధ ద్రవ్యాలు

శ్రీ విశ్వావసు నామ సంవత్సర రాశిఫలాలు - Advt Feature

మేష రాశి
అశ్విని, భరణి, కృత్తిక మొదటిపాదం

ఆదాయం -2, వ్యయం -14, రాజపూజ్యం -5, అవమానం -7

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (తృతీయ) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (లాభం) కేతువు సింహరాశి (పంచమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (వ్యయం)లో సంచారం ఏలి నాటి శని ప్రారంభం అయినది. ప్రతి విషయమునకు శని పేరు చెప్పి భయపడకండి. కేవలం ఈ సంవత్సరం పనులు ఆలస్యం అవ్వటమే కానీ పనులు పాడవ్వడం అనేది లేదు. దూకుడుగా నిర్ణయాలు చేయకండి. మిత భాషణ మరియు ఇతరుల వ్యవహారములలో తలదూర్చకుండా ఉండడం చాలా అవసరం. ఇతరుల సహకారం తక్కువగా ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై మంచిగా వ్యవహరించి సత్ఫలితాలు అందుకుంటారు. అనవసర కాలక్షేపం కూడా చేస్తారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా బంధువర్గంతో బహు జాగ్రత్తలు తీసుకోండి. పెద్దల ఆరోగ్య విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. పిల్లల అభివృద్ధి విషయంగా కూడా ఫలితాలు సానుకూలంగా ఉంటాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల నుండి ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. స్థానచలన ప్రయత్నాలు ప్రత్యేకం చేయాలి. ప్రమోషన్ ప్రయత్నాలు ప్రత్యేకం చేయకపోతే ప్రతికూల ప్రదేశాలకు చేరతారు. నూతన ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నవారికి పనులు వేగంగా సాగవు.

వృషభం
కృత్తిక 2,3,4, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఆదాయం -11, వ్యయం -5, రాజపూజ్యం -1, అవమానం -3

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (ద్వితీయం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (దశమం) కేతువు సింహరాశి (చతుర్థం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (లాభం)లో సంచారం. శని సంచారం గురు సంచారం అనుకూలంగా ఉన్న కారణంగా చాలా మంచి ఫలితాలు అందుకుంటారు. సాంఘీకంగా గౌరవ మర్యాదలు పెరుగుతుంటాయి. సమయపాలనతో చాలా విజయాలు సాధిస్తారు. కీర్తి ప్రతిష్టలు పెరుగుతుంటాయి. ధర్మకార్యములు తరచుగా చేస్తూ ఉంటారు. ఆహార విహార విషయాలలో మీకు సంతుష్టి కలుగుతుంది. రోజువారీ కార్యముల విషయమై ఎటువంటి సమస్యలు లేని జీవితం సాగుతుంది. కుటుంబ విషయాలు పరిశీలింపగా అన్ని విధములుగా మంచి ఫలితాలు అందుకుంటారు. పిల్లల అభివృద్ధి వారి నిమిత్తంగా చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ ఆచార సంబంధమైన కార్యక్రమములు చేస్తుంటారు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ప్రమోషన్‌లు వచ్చే అవకాశం ఉంటుంది. మీకు అందరి నుండి సహాయ సహకారములు బాగా అంది మంచి విజయములు సాధించే అవకాశం ఉన్నది. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో వున్నవారికి పనులు చాలా అనుకూలంగా ఉంటాయి.

మిథునం
మృగశిర 3,4, ఆరుద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

ఆదాయం -14, వ్యయం -2, రాజపూజ్యం -4, అవమానం -3

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (జన్మం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (నవమం) కేతువు సింహరాశి (తృతీయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (దశమం)లో సంచారం. తరచుగా బుద్ధి భ్రంశనమునకు లోనవుతుంటారు. దూరప్రాంతములకు వెళ్ళాలి. చేయు పనులు విడిచి ప్రశాంతంగా దూరంగా వెళ్ళాలనే కోరిక పెరుగుతుంటుంది. చేసే ప్రతిపనీ పరధ్యానంగా చేస్తారు. మీ ప్రయత్నాలు ఏవీ సరిగా సాగవు. అందరూ 'నన్ను సరిగా గౌరవించడం లేదు' అనే భావన పెరుగుతుంది. చతుష్పాద జంతువులతో ఇబ్బంది ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై సమయ పాలనతో కూడి పనులు పూర్తి అవుతుంటాయి. కుటుంబ విషయాలు పరిశీలింపగా మే వరకు కొన్ని సమస్యలతోనూ మే నుండి కొంత అనుకూల వాతావరణము ఉంటుంది. మీ కుటుంబ వ్యవహారములలో ఇతరుల ప్రమేయం నిర్ద్వంద్వంగా ఖండిస్తే సుఖపడతారు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీకు సహకరించే అధికారులు విరుద్ధంగా ఉంటారు. ప్రతిపనీ మీ అవగాహన లోపం వలన ఒకటికి రెండుసార్లు చేయవలసి వచ్చి ఇబ్బంది పడుతుంటారు. వ్యాపారస్తులకు అనుకూల స్థితి తక్కువ. ఆలోచనలకు, అమలుకు సంబంధం లేక సాధారణ ఫలితాలు అందుకుంటారు.

కర్కాటకం
పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

ఆదాయం -8, వ్యయం -2, రాజపూజ్యం -7, అవమానం -3

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (నవమం) ప్రవేశం, రాహువు మే 19వ తేదీన కుంభరాశి (అష్టమం) కేతువు సింహరాశి (ద్వితీయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (భాగ్యం)లో సంచారం. ఒకసారి విశేష అనుకూల వాతావరణం, ఒక్కోసారి ప్రతికూల వాతావరణం ఈ విధంగా చికాకుపడతారు. మే నెల దగ్గర నుండి మానసిక, శారీరక శ్రమ ఎక్కువ. మీరు మీ వస్తువులు ఏదో ఒక రూపంలో నష్టపడుతూ ఉంటారు. జాగ్రత్త పడాలి అనే విషయాలలో అనవసర ప్రయత్నాలు చేస్తారు. తరచుగా పుణ్యక్షేత్ర సందర్శన నిమిత్తం ప్రయాణం చేస్తారు. రోజువారీ కార్యముల విషయమై అన్ని సమయపాలన లేక ఇతర పనులు కూడా చికాకు పెడుతుంటాయి. కుటుంబ విషయాలు పరిశీలింపగా పిల్లలకు మీకు సరిగా మానసిక స్థితి సమన్వయం అవ్వక బాధపడతారు. పెద్దల ఆరోగ్య విషయం కూడా ప్రతికూలంగా ఉంటుంది. బంధువుల ప్రమేయం కుటుంబ విషయాలలో ఎక్కువ. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల ఆగ్రహావేశాలు మే తరువాత ఎక్కువ. మే వరకు చాలా తెలివిగా ప్రవర్తిసారు. స్థానచలనం మరియు ప్రమోషన్ విషయాలు ఆశించిన రీతిగా ఉండవు జాగ్రత్తపడండి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి మోసపోయే లక్షణాలు ఉన్నాయి.

సింహం
మఖ, పుబ్బ, ఉత్తర మొదటి పాదం

ఆదాయం -11, వ్యయం -11, రాజపూజ్యం -3, అవమానం -6

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (లాభం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (సప్తమం) కేతువు సింహరాశి (జన్మం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (అష్టమం)లో సంచారం. ప్రతి విషయంలో మనస్పర్ధలు రావడం వాటిని సరిచేసుకోవడంతో కాలక్షేపం అవుతుంది. గురుబలం ఈ సంవత్సరం అంతా శ్రీరామ రక్ష. పార్టనర్‌షిప్ వ్యవహారములలో జాగ్రత్త అవసరం. అన్ని రకాలైన వ్యవహారములలోనూ గురు అనుకూలం దృష్ట్యా మంచి ప్రణాళికలు చేసినా మీ చుట్టూ ఉన్న సన్నిహితులను నమ్మి సమస్యలకు దగ్గర అవుతుంటారు. రోజువారీ కార్యముల విషయమై మీకు భోజన, స్నాన, నిద్ర వంటి వాటికి కూడా సమయపాలన ఉండదు. కుటుంబ విషయాలు పరిశీలింపగా ప్రత్యేకంగా చెప్పే విషయం ఏమిటంటే 'మితభాషణ' అవసరం. దాని వలన సుఖపడతారు. శని, రాహు సంచారం బాగా లేదు. ఇతరుల ప్రమేయం ఆపివేయండి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా అధికారుల అండదండలు బాగా ఉంటాయి. మీరు మీ క్రింద పనిచేయువారి ద్వారా ఇబ్బందులకు దగ్గరవుతారు. మోసపోవు లక్షణాలు గోచరిస్తున్నాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి అయోమయ స్థితి ఉంటుంది. తెలివిగా ఉన్నా మోసపోతుంటారు.

కన్య
ఉత్తర 2,3,4, హస్త, చిత్త 1,2 పాదాలు

ఆదాయం -14, వ్యయం -2, రాజపూజ్యం -6, అవమానం -6

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (దశమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (షష్ఠం) కేతువు సింహరాశి (వ్యయం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (సప్తమం)లో సంచారం మే నెల వరకు పుణ్యకార్యములు, ధర్మకార్యములు విజ్ఞాన వినోద కార్యములు చేస్తుంటారు. ధర్మకార్యాచరణ ద్వారా సంఘంలో గౌరవ మర్యాదలు పెంచుకుంటారు. ప్రతి పనిలోనూ మే నెల నుండి ధైర్యం పెరుగుతుంది. అయితే ప్రతిపనీ ఆలస్యం అవుతుంది. తరచుగా కుటుంబమునకు ఎక్కువ సమయం దూరం గడపవలసి ఉంటుంది. కొన్నిసార్లు భయం పొందుతారు. రోజువారీ కార్యముల విషయమై మే నుండి సమయపాలన లేకుండా ప్రవర్తిస్తారు, చికాకుపడతారు. కుటుంబ విషయములు పరిశీలింపగా బంధువుల రాకపోకలు అధికం అవుతాయి. మీకు, మీ కుటుంబ సభ్యులకు ఉన్న ఆలోచనలు సరిగా అమలు చేయలేరు. అయితే ఆనందంగా కాలక్షేపం చేయగలుగుతారు. మే నెల నుండి మీ కింద పనిచేయు వర్కర్స్‌తో ఇబ్బంది ఉంటుంది. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్న వారికి తేలికపాటి ప్రయత్నాలతో కొన్నిసార్లు శుభవార్త అందుకుంటారు. వ్యాపారస్తులకు అన్ని పనులు సానుకూలంగా సాగుతాయి. లాభాలు తక్కువ అయినా ప్రశాంతంగా ఉంటారు.

తుల
చిత్త 3,4, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఆదాయం -11, వ్యయం -5, రాజపూజ్యం -2, అవమానం -2

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (భాగ్యం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (పంచమ) కేతువు సింహరాశి (లాభం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (షష్ఠ)లో సంచారం. చాలా సమస్యలకు పరిష్కారం పొందగలిగే కాలం ప్రారంభం అయినది. క్రమంగా మే నెల నుండి శుభ పరిణామములు ఎక్కువగా ఉంటాయి. పుణ్యకార్యములు, శుభకార్యములు, సాంఘీక కార్యములు చేయు అవకాశం ఎక్కువగా ఉంటుంది. గత సమస్యలు కూడా తీరు అవకాశం ఈ సంవత్సరం మే నెల నుండి అవకాశం ఎక్కువ అవుతుంది. ఆనందంగా ఉంటారు. రోజువారీ కార్యముల విషయమై సానుకూలం ఉంటుంది. సమయపాలన చేయు అవకాశములు ఎక్కువ. కుటుంబ విషయాలు పరిశీలింపగా అంతా శుభ పరిణామములు ఎక్కువ. భార్యాపిల్లల ద్వారా వారి నుండి మీకు మీ నుండి వారికి జరగవలసిన అంశాలు అంతా కూడా చక్కగా పూర్తిచేయు అవకాశములు ఉంటాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ఇబ్బందులు లేని జీవితం సాగుతుంది. రాబోవు కాలంలో క్రమంగా అభివృద్ధి వైపు ప్రయాణం సాగుతుంది. అనూహ్యంగా అందరూ సహకారం బాగా చేస్తారు. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి మంచి సలహాలు అంది చక్కటి లాభాలు అందుకుంటారు.

వృశ్చికం
విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయం -2, వ్యయం -14, రాజపూజ్యం -5, అవమానం -2

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (అష్టమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (అర్ధాష్టమ) కేతువు సింహరాశి (దశమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (పంచమం)లో సంచారం. సాధారణ స్థాయికి విరుద్ధంగా మీకు గ్రహచారం ఉన్నది. అందువలన ప్రత్యేక నియమాలలో జీవనం సాగించాలి. ఏ పనిలోను స్థిరబుద్ధి ప్రదర్శించలేరు. అందరికీ మీ వ్యవహారముల మీద తక్కువ స్థాయి ఆలోచనలు ఉంటాయి. మీరు తరచుగా చోరులు, అన్ని ప్రభుత్వ అధికారులు వంటి వారిలో ఎవరితోనయినా చికాకు పడుతూనే ఉంటారు. తరచుగా క్రూరవాక్యములు పలుకుతూ ఉంటారు. రోజువారీ కార్యముల విషయమై మీరు సరియగు స్థిరబుద్ధి ప్రదర్శింపక పనులు ఆలస్యం చేసి ఇబ్బంది పడతారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా మీ నుండి కుటుంబీకులకు అందవలసిన సర్వీసెస్‌లు అన్నీ ఆలస్యంగా అందుతాయి. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీరు సరియగు దృష్టి ప్రదర్శింపక పనులు పాడుచేసుకుంటారు. మీ సన్నిహితులు తప్పనిసరిగా మీకు అత్యవసర సమయాలలో సహకరించరు. ప్రమోషన్, స్థానచలనములు అనుకూలంగా లేవు. వ్యాపారస్తులకు అనుకూల లాభాలు లేకపోయినా ఇబ్బందులు ఉండవు. వ్యాపార సమయంలో ఒత్తిడి ఎక్కువ.

ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ మొదటి పాదం

ఆదాయం -5, వ్యయం -5, రాజపూజ్యం -1, అవమానం -5

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (సప్తమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (తృతీయం) కేతువు సింహరాశి (భాగ్యం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (అర్ధాష్టమం)లో సంచారం. ఈ రాశి వారికి ఈ సంవత్సరం చక్కగా చేసిన పనులకు గుర్తింపు సరిగా అందదు. అయితే గొప్పగా ఓర్పు సహనం ప్రదర్శించి సాధారణ స్థాయి జీవనమునకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తపడతారు. అందరితోనూ కలహములు రాకుండా స్నేహ భావం ప్రదర్శిస్తారు. శరీరం గాంభీర్యం కోల్పోయినట్లుగా గోచరిస్తుంది. స్నేహితులతో మితంగా సంభాషణ, సంచారం చేయండి. రోజువారీ కార్యముల విషయమై ప్రధానంగా ప్రత్యేక దృష్టి ఉంచండి. వీటి తరువాతనే ఇతర కార్యములు. కుటుంబ విషయములు పరిశీలింపగా శుభపరిణామములకు అవకాశములు ఎక్కువ. మీ అవసరాలు గుర్తించి సహకరించే కుటుంబ సభ్యులు ఉన్న కారణంగా మంచి ఫలితాలు ఉంటాయి. సోదరద్వేషం తప్పదు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు జాగ్రత్తగా చేసుకుంటే మీకు కావలసిన స్థలం చేరే అవకాశం ఉంటుంది. ఎవరూ సహకరించరేమో అనే రీతిగా మీ చుట్టూ పరిస్థితులు ఉంటాయి. కానీ విజయం తథ్యం. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి అనుకూలం.

మకరం
ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1,2 పాదాలు

ఆదాయం -8, వ్యయం -14, రాజపూజ్యం -4, అవమానం -5

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (షష్ఠం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (ద్వితీయం) కేతువు సింహరాశి (అష్టమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (తృతీయం)లో సంచారం. కేవలం శని రాహు సంచారం అనుకూలం చేత చాలా విజయాలు సాధిస్తారు. అయితే జూన్ వరకు కుజ సంచారం ప్రభావంగా ప్రయాణ విషయాలలో చికాకులు ఉంటూ ఉంటాయి. స్వబుద్ధి, స్వశక్తితో మీరు చాలా విజయాలు సాధిస్తారు. దీర్ఘమైన పనులు కొంచెం శ్రమతో కూడిన పనులు జూన్‌లోపుగా పూర్తి చేసుకుని ప్రయత్నం చేయడం మంచిది. రోజువారీ కార్యముల విషయమై ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాలక్షేపం జరుగుతుంది. అయితే కుటుంబ విషయాలు పరిశీలింపగా మీరు కొంచెం ఓర్పుగా కుటుంబ వ్యవహారముల చూసుకోవాలి అంతా చక్కగా ఉంటుంది. కానీ చికాకులు ఎప్పుడు ఎలా మొదలవుతాయో చెప్పలేని స్థితి ఉంటుంది. ఉద్యోగ విషయములు పరిశీలింపగా శని సంచార అనుకూల ప్రభావం సర్వత్రా విజయమే. మంచి గుర్తింపు వస్తుంది. ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాలు, ప్రమోషన్ ప్రయత్నాలు కూడా చాలా విశేషంగా అనుకూల ఫలితాలు ఇస్తాయి. నూతన ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి పనులు జూన్ వరకు విశేషం.

కుంభం
ధనిష్ఠ 3,4, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆదాయం -8, వ్యయం -14, రాజపూజ్యం -4, అవమానం -5

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (పంచమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (జన్మం) కేతువు సింహరాశి (సప్తమం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (ద్వితీయం)లో సంచారం. ఏలినాటి శని తృతీయ భాగంలో నడుస్తుంది. అయితే పెద్దగా రాహువు యోగించకపోయినా గురుబలం అనుకూలం వలన చాలా మంచి ఫలితాలు అందుకుంటారు. ప్రతి విషయంలోనూ కొన్నిసార్లు తెలివిగాను, కొసార్లు అసహనంతో ప్రవర్తిస్తుంటారు. అన్ని విషయాలలో మీ గౌరవ మర్యాదలకు భంగం కలుగకుండా ఉండేలాగ మీ ప్రవర్తనను చూసుకుంటూ గడపండి. రోజువారీ కార్యముల విషయమై మీరు స్థిరచిత్తంతో ప్రవర్తింపక కొత్త కొత్త సమస్యలు అందుకుంటారు. కుటుంబ విషయాలు పరిశీలింపగా అనవసర కలహాలకు కుటుంబ సభ్యులకు అవకాశం ఇచ్చేలాగ ప్రవర్తిస్తుంటారు. అయితే గురుబలం అనుకూలం వలన పెద్ద స్థాయి ఇబ్బందులు కుటుంబ విషయంగా ఈ రాశివారికి ఉండవు. ఉద్యోగ విషయములు పరిశీలింపగా మీరు ఓర్పుగా కొన్నిసార్లు ప్రవర్తించి మంచి ఫలితాలు అందుకుంటారు. కొన్నిసార్లు చికాకుగా వ్యవహరించి ఇబ్బందులు పొందుతారు. వ్యాపారస్తులకు అంతా శుభ ఫలితాలే ఉంటాయి.

మీనం
పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆదాయం -5, వ్యయం -5, రాజపూజ్యం -3, అవమానం -1

ఈ సంవత్సరం గురువు మే 14వ తేదీన మిథునరాశి (అర్ధాష్టమం) ప్రవేశం. రాహువు మే 19వ తేదీన కుంభరాశి (వ్యయం) కేతువు సింహరాశి (షష్ఠం)లో సంచరిస్తారు. శని మార్చి 29వ తేదీ నుండి మీనరాశి (జన్మం)లో సంచారం. ఏలినాటి శని జన్మంలో రెండవ భాగం ప్రారంభం. జన్మ శని వ్యయ రాహు తగు జాగ్రత్తలతో కాలక్షేపం చేయాలి. మీ ప్రమేయం లేకుండా సమస్యలు తలెత్తే సమయం. అందరినీ అనుమానిస్తారు. మీరు అందరి చేత అనుమానింపబడతారు. వీలైనంత వరకు ఇతర పనులు ఆపివేయండి. ప్రతి పనిలోనూ మందగమనం ఉంటుంది. రోజువారీ కార్యముల విషయమై బహు శ్రద్ధ, జాగ్రత్త వహించండి. అది మిగిలిన దినచర్యను రక్షిస్తుంది. కుటుంబ విషయాలు పరిశీలింపగా మీకు ఇబ్బంది లేని జీవనశైలి ఉంటుంది. అయితే మీరు చూపించే అలసత్వం మరియు వాయిదా పద్ధతులు మీకు అవనసర కలహములు, మానసిక ఒత్తిడి సృష్టిస్తాయి. ఋణ విషయములో అవమానం సృష్టించకుండా జాగ్రత్తపడండి. కాలం అనుకూలం లేదు. ఋణం ప్రమాదకరము. ఆరోగ్య విషయంలో నేత్ర బాధలు ఉన్నవారు కొంచెం ఇబ్బంది ఎక్కువ పొందుతారు. కోర్టు వ్యవహారములలో ఉన్నవారికి అందరూ బాగా సహకారం చేస్తారు అనే వారు కూడా మోసం చేస్తారు.